


11న ముఖ్యమంత్రి చంద్రబాబు రాక?



విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 11వ తేదీన నగరానికి రానున్నట్టు తెలిసింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా విశాఖ వస్తున్న ఆయన మెడ్‌టెక్ జోన్‌ను సందర్శించి నిపుణులు, ఉద్యోగులు, సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం అనకాపల్లి కూడా వెళ్లే అవకాశం ఉందంటున్నారు. అయితే సీఎం పర్యటనను ఇంకా అధికారులు ధ్రువీకరించలేదు.

ఇసుక అక్రమాలకు చెక్

గతంలోని అనధికార క్వారీలపై అధికారుల ఆరా



నక్కపల్లి ఇసుక డిపోలో నిల్వలు

- కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీతో అక్రమాలకు అడ్డుకట్ట
- జిల్లాలోని నక్కపల్లి డిపోలో అమ్మకాలు ప్రారంభం
- నర్సీపట్నం మండలం గబ్బాడ డిపోలో ప్రారంభంకాని విక్రయాలు
- స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుక అందజేసేందుకు ఏర్పాట్లు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న ఉచిత ఇసుక పాలసీతో జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం సాగించిన ఇసుక దందాకు చెక్ పడనుంది. అనుమతులు లేకపోయినా జిల్లా వ్యాప్తంగా వైసీపీ నేతలు ఎక్కడికక్కడ నదీ పరివాహక ప్రాంతాల్లో అనధికార క్వారీలు ఏర్పాటు చేసుకొని, ఇసుక తవ్వకాలు జరిపి దర్జాగా సాగించిన ఇసుక వ్యాపారానికి అడ్డుకట్ట పడనుంది.

జిల్లాలో నక్కపల్లి, నర్సీపట్నం డిపోల్లో ఇప్పటికే నిల్వ ఉన్న సుమారు 65 వేల టన్నుల పాత ఇసుకను విక్రయించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రెండు డిపోల్లో టన్ను ఇసుక రూ.1,225 ధర నిర్ణయించింది. నక్కపల్లి ఇసుక డిపోలో ఇసుక విక్రయాలు సోమవారం మొదలయ్యాయి. నర్సీపట్నం మండలంలోని గబ్బాడ ఇసుక డిపోలో వేయింగ్ మెషీన్ మరమ్మతుల కారణంగా ఇసుక విక్రయాలు ప్రారంభం కాలేదు. కాగా 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం పేదలకు ఇసుక ఉచితంగా



నర్సీపట్నం ఇసుక డిపో వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

ఇచ్చిన సంగతి తెలిసిందే. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక జేపీ వెంచర్స్ అనే సంస్థకు ఇసుక సేకరణ, విక్రయాల బాధ్యతలను అప్పగించింది. దీంతో జిల్లాల వారీగా కొందరు వైసీపీ నాయకులే ఇసుక వ్యాపారం చేసి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. జిల్లాలో గతంలో అనధికార ఇసుక క్వారీలు ఎక్కడెక్కడ

... మిగతా 6వ పేజీలో

నక్కపల్లి డిపోలో ఇసుక అమ్మకాలు ప్రారంభం

నక్కపల్లి: నక్కపల్లి ఇసుక డిపో వద్ద సోమవారం సాయంత్రం నుంచి ఇసుక అమ్మకాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం నుంచి జీవో వచ్చిన వెంటనే ఆర్డీవో జయరాం, ఏడీ మైన్స్ సుబ్బారాయుడు, తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇసుక డిపోలో అమ్మకాలు ప్రారంభించారు. సీఐ అప్పన్న పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం టన్ను ఇసుక ధర రూ.1,225లుగా నిర్ణయించారు. తొలి రోజు పెద్దగా అమ్మకాలు సాగలేదు. అంతకుముందు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఇక్కడి ఇసుక డిపోను పరిశీలించారు. మైన్స్‌శాఖ ఏడీ సుబ్బారాయుడి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక అమ్మకాలు పారదర్శకంగా జరగాలని ఆయన ఆదేశించారు. ఎప్పటికప్పుడు షిఫ్ట్‌ల వారీగా ఇసుక డిపో వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని, సీఐ అప్పన్న చెప్పారు. మంగళవారం



నక్కపల్లి ఇసుక డిపోను పరిశీలిస్తున్న ఎంపీ సీఎం రమేశ్

ఉదయం నుంచి సీసీ కెమెరాలతో నిఘా వుంటుందని చెప్పారు. ఎంపీ వెంట బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు మీగడ సత్తిబాబు వున్నారు.

గబ్బాడలో ప్రారంభంకాని అమ్మకాలు



గబ్బాడ ఇసుక డిపోను పర్యవేక్షిస్తున్న సెబ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్

నర్సీపట్నం: మండలంలోని గబ్బాడ ఇసుక డిపోలో సోమవారం ఇసుక అమ్మకాలు ప్రారంభంకాలేదు.వేయింగ్ మెషీన్ మరమ్మతుల కారణంగా ఇసుక అమ్మకాలు ప్రారంభించలేదు. డిపోలో ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు వచ్చిన తరువాత ఆయన సమక్షంలో ఇసుక సరఫరా ప్రారంభిస్తామని ఆర్డీవో జయరాం తెలిపారు.

కూర్మావతారంలో జగన్నాథుడు

అనకాపల్లిలోని ఇంద్రజ్యుమ్న హాల్‌లో కొలువుదీరిన సుభద్ర బలభద్ర సమేత జగన్నాథ స్వామి సోమవారం భక్తులకు కూర్మావతారంలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

- వార్త 5వ పేజీలో..



కూర్మావతారంలో జగన్నాథస్వామి

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



ఫిర్యాదీలతో మాట్లాడుతున్న కలెక్టర్ కె.విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్/ తుమ్మపాల, జూలై 8: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని అధికారులను కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొని పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని సూచించారు. అర్జీలు పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ మేరకు ఆయా శాఖల పరిధిలో గల సమస్యలపై 303 అర్జీలు అందాయని చెప్పారు. అత్యధికంగా రెవెన్యూ డిపార్టుమెంట్‌కు 168, ల్యాండ్ రికార్డు సర్వే శాఖకు 25, పోలీస్‌శాఖకు 25, పంచాయతీరాజ్‌శాఖకు 20, ఆరోగ్యశాఖకు 10, మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్‌కు ఏడు, రూరల్ డెవలప్‌మెంట్‌శాఖకు ఆరు, విద్యా, సోషల్ వెల్ఫేర్, విద్యుత్, కో- ఆపరేటివ్ సొసైటీ శాఖలకు నాలుగేసి చొప్పున, సివిల్ సప్లయీస్, ఆర్‌డబ్ల్యూఎస్, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పోవర్టీ శాఖలకు మూడేసి చొప్పున, వాటర్ రీసోర్స్, మైన్స్, పొల్యూషన్ శాఖలకు రెండేసి చొప్పున, సీనియర్ సిటిజన్స్, మత్స్యకార, ఎన్‌ఈపీఎస్‌పీ, ఆర్ అండ్ బీ, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, పంచాయతీరాజ్, ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ తదితర శాఖలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు అందాయని ఆమె చెప్పారు. సకాలంలో అర్జీలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతులు!

చెరువును తలపించేలా తట్టబంద- తోటకూరపాలెం రోడ్డు

- గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మరమ్మతులకు నోచుకోని వైనం
- వాహన చోదకులకు తప్పని ఇబ్బందులు



తట్టబంద కాన్వెంట్ వద్ద చెరువును తలపించేలా ఉన్న భారీ గొయ్యి



తట్టబంద- తోటకూరపాలెం మార్గంలో గోతులు

రావికమతం, జూలై 8: చెరువును తలపించేలా గోతులు.. వాహనాలు రాకపోకలు సాగించడానికి కూడా వీలు లేని అధ్వాన పరిస్థితులు.. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గోతుల్లో నీరు చేరి ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు.. ఇదీ మండలంలోని తట్టబంద- తోటకూరపాలెం రోడ్డు దుస్థితి. వైసీపీ గత ఐదేళ్ల పాలనలో కనీసం ఈ రహదారికి మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

మండలంలోని తట్టబంద మీదుగా తోటకూరపాలెం వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు గోతులమయంగా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. రావికమతం- అనకాపల్లికి ఇది ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రహదారి రావికమతం నుంచి తోటకూరపాలెం వరకు ఆపై తీడ కన్నూరుపాలెం, తాళ్లపాలెం వెళ్లే ప్రధాన రహదారిని కలిపి ఉంది. రావికమతం, బుచ్చియ్యపేట, మాకవరపాలెం మండలాల్లో సుమారు వంద గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. ఎర్రవాయి ప్రాంత ప్రజలంతా నిత్యం ఇటు రావికమతానికి, అటు అనకాపల్లి, తాళ్లపాలేనికి ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు గతంలో పంచాయతీరాజ్ పరిధిలో ఉండేది. ఆ సమయంలోనే మెటల్ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. పంచాయతీరాజ్ నుంచి రోడ్డు నిర్వహణకు నిధులు సక్రమంగా లేవని గత ప్రభుత్వ హయాంలో ఆర్ అండ్ బీలో విలీనం చేశారు. అయితే క్వారీ, నరుగుడు, వివిధ భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో ఈ రోడ్డు అడుగుకో గొయ్యి చొప్పున చెరువును తలపించే విధంగా తయారైంది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారింది. గత వైసీపీ పాలకుల హయాంలో కనీసం రోడ్డు మరమ్మతులకు కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ రోడ్లపై అత్యవసర రోగులను, గర్భిణులను సకాలంలో ఆస్పత్రికి తరలించలేకపోతున్నామని ఎర్రవాయి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బీ మాడుగుల సెక్షన్ జేఈ సాయి శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఈ రహదారి అభివృద్ధికి రూ.3 కోట్లు అవసరమని ప్రతిపాదనలు తయారు చేసి గత ప్రభుత్వానికి పంపామని, అయితే నిధులు మంజూరు కాలేదన్నారు.

ఎరువుల కోసం ఎదురుచూపులు

ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు గోవాడ చెరకు రైతులకు ఫ్యాక్టరీ యాజమాన్యం పంపిణీ

- ఈసారి సీజన్ ప్రారంభమైనా అందని వైనం
- ఇంకా విధుల్లో చేరని ఫీల్డు సిబ్బంది
- సమాచారం తెలియక అయోమయంలో రైతులు
- కలెక్టర్ అనుమతి కోసం ఫ్యాక్టరీ అధికారుల ప్రయత్నాలు



ఫ్యాక్టరీ సరఫరా చేసే ఎరువులు (ఫైల్)

చోడవరం, జూలై 8:

సరిగ్గా ఖరీఫ్ సీజన్‌కు ముందు గోవాడ చెరకు రైతులకు ఎరువుల కష్టం ఎదురైంది. ఏటా సీజన్ ముందు రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేసే గోవాడ షుగర్స్ యాజమాన్యం, ఈసారి సీజన్ ప్రారంభమైనా ఇప్పటి వరకు సరఫరా చేపట్టకపోవడంతో రైతుల నుంచి ఎరువుల కోసం ఒత్తిడి పెరిగింది.

గోవాడ యాజమాన్యం ఏటా ఖరీఫ్ సీజన్‌లో చెరకు రైతులకు ముందస్తుగా యూరియా, సూపర్, పొటాష్, తదితర ఎరువులు సరఫరా చేసేది. ప్రతి ఏటా వర్షాలు ప్రారంభమయ్యేసరికి గోవాడ షుగర్స్ యాజమాన్యం ఎరువులను తెప్పించి కాటాల వారీగా రైతులకు పంపిణీ చేసేది. సీజన్‌లో ఫ్యాక్టరీ ఇచ్చే ఈ ఎరువులు ఇటు చెరకు తోటలతోపాటు, అటు వరి, ఇతర పంటలకు కూడా సరిపోయేలా ఉండడంతో రైతులకు సీజన్‌లో ఎరువుల బాధ ఉండేది కాదు. పైగా ఫ్యాక్టరీ ఇచ్చే ఎరువులకు ముందస్తుగా డబ్బు చెల్లించవలసిన అవసరం లేకపోవడం, ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన తరువాత ఇచ్చే పేమెంట్లలో ఎరువుల డబ్బులు కటింగ్ చేసే పరిస్థితి ఉండడంతో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఫ్యాక్టరీ పంపిణీ చేసే ఎరువులు అరువు పద్ధతిపై ఇవ్వడంతో సీజన్‌లో రైతులకు పెట్టుబడి ఖర్చుల భారం తగ్గేది. దీంతో గ్రామీణ ప్రాంతంలో అందరూ సీజన్ వచ్చిందంటే గోవాడ ఫ్యాక్టరీ ఇచ్చే ఎరువులపైనే ఆధారపడడం సాధారణంగా మారిపోయింది. గోవాడ ఫ్యాక్టరీ యాజమాన్యం ఏటా నాలుగు వేల టన్నుల వరకు యూరియా, ఇతర ఎస్ఎస్‌పీ, పొటాష్ ఎరువులను సరఫరా చేయడం వల్ల గ్రామాల్లో రైతులకు ఎరువుల కోసం పెద్దగా ఇబ్బంది పడవలసిన పరిస్థితి ఉండేదికాదు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఎరువులు వచ్చే జాడ మాత్రం కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఫ్యాక్టరీ ఎరువులు ఇస్తుందా?, లేదా? అనే సందేహం రైతుల్లో నెలకొంది. గోవాడలో నెలకొన్న ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా గత రెండేళ్లుగా ఎరువుల సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నప్పటికీ అధికారులు ఏదో విధంగా నిధులు సర్దుబాటు చేసి రైతులకు పూర్తిస్థాయిలో కాకున్నా కొంతమేర అయినా ఎరువులు సరఫరా చేస్తూ వచ్చారు. కానీ ఈ ఏడాది మాత్రం ఇంకా ఎరువుల పంపిణీ జాడ లేకపోవడంతో ఎరువుల పంపిణీ ఎప్పుడు చేస్తారా? అని రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. గత సీజన్ చెరకు బకాయిలు ఇంకా రూ.7.14 కోట్లు చెరకు రైతులకు అందవలసి ఉంది. గత ఏడాది సరఫరా చేసిన చెరకుకు సంబంధించి రైతులకు ఇవ్వవలసిన బకాయిల్లో టన్నుకు రూ.2500 చొప్పున పూర్తిగా అందరికీ పేమెంట్లు ఇచ్చారు. కానీ టన్నుకు రూ.2,919 చొప్పున రైతులకు ఇవ్వవలసి ఉండగా రూ.419 రూపాయలు ఇంకా వారికి అంద లేదు. అసలే ఆర్థిక భారంలో ఉన్న గోవాడకు ఈ నిధులు సమకూర్చవలసి రావడంతో పాటు ఎరువులు కొనుగోలుకు నిధులు వెచ్చించవలసిన భారం కూడా పడడంతో ఫ్యాక్టరీపై మరింత ఆర్థిక భారం పెరిగిందని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో గోవాడ ఫ్యాక్టరీ ఎంత వరకు ఎరువులు సమకూర్చగలదన్నది ప్రశ్నార్థకంగానే ఉందని పలువురు అంటున్నారు. .

విధుల్లో చేరని ఫీల్డు సిబ్బంది

చెరకు రైతుల ఎరువుల పరిస్థితి ఇలా ఉంటే, మరో వైపు వ్యవసాయ ఫీల్డు మేన్లు, ఇతర సిబ్బందిని యాజమాన్యం ఇంకా విధుల్లోకి తీసుకోకపోవడంతో కాటాల వద్ద రైతులకు సమాచారం ఇచ్చేనాథుడు లేకుండా పోయాడని రైతులు వాపోతున్నారు. ఏటా సీజన్ ముగిసిన తరువాత రెండు నెలల విరామం ఇచ్చిన అనంతరం ఫీల్డు సిబ్బందిని విధుల్లోకి తీసుకునేవారు. కానీ ఈ ఏడాది ఎన్నికల షెడ్యూల్ ఉండడంతో ముందుగానే కార్మికులను కానీ, ఫీల్డు సిబ్బందిని కానీ యాజమాన్యం విధుల్లోకి తీసుకోలేదు. దీంతో కాటాల వద్ద గాని, ఫీల్డులో గాని వ్యవసాయ సిబ్బంది కనిపించకపోవడంతో ఎరువులు, ఇతర సమాచారం కోసం ఎవరిని అడగాలో తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు.

కలెక్టర్ అనుమతి కోసం ప్రయత్నం

గోవాడ ఫ్యాక్టరీ పరిధిలో చెరకు రైతులకు ఎరువుల సరఫరాపై కలెక్టర్ అనుమతి కోసం ప్రయత్నిస్తున్నాం. ఎన్నికల కారణంగా కలెక్టర్ బిజీగా ఉండడంతో ఎరువుల ఫైలుపై కలెక్టర్ నిర్ణయం తీసుకోవడానికి వీలుపడలేదు. ప్రస్తుతం కొత్త కలెక్టర్ విధుల్లో చేరడంతో ఆమెకు పరిస్థితిని వివరించి, రైతులకు ఎరువులు అందేలా చర్యలు చేపడతాం. ఎరువుల కోసం రైతుల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువగానే ఉంది. కలెక్టర్ నుంచి అనుమతి వస్తే ఆర్‌బీకేల ద్వారానే చెరకు రైతులకు ఎరువులు అందించే ఏర్పాట్లు చేస్తాం.

- వి.సన్యాసినాయుడు, గోవాడ షుగర్స్ ఎండీ

ఫార్మా రసాయన వ్యర్థాల డ్రమ్ముల కలకలం

- పెదముషిడివాడలో డంపింగ్‌తో స్థానికుల ఆందోళన
- నమూనాలు సేకరించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది

లంకెలపాలెం, జూలై 8: ప్రమాదకరమైన ఫార్మా రసాయన వ్యర్థాలతో కూడిన డ్రమ్ముల డంపింగ్ పెదముషిడివాడలో సోమవారం ఉదయం కలకలం రేపింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో గల బచ్చల చెరువులో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు భారీగా రసాయన వ్యర్థాలతో డ్రమ్ములను డంపింగ్ చేశారు. భరించలేని దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో స్థానికులు సోమవారం బచ్చల చెరువు వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఫార్మా పరిశ్రమలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయన్నారు. ప్రమాదకరమైన విష రసాయన వ్యర్థాలను ఎక్కడిపడితే అక్కడ విడిచి పెడితే ఎవరు

... మిగతా 6వ పేజీలో



బచ్చల చెరువులో డంపింగ్ చేసిన ఫార్మా రసాయన వ్యర్థాల డ్రమ్ములు

మూడు విమాన సర్వీసులు రద్దు



విశాఖపట్నం, జూలై 8: విశాఖ వచ్చి వెళ్లాల్సిన మూడు విమాన సర్వీసులను సోమవారం వేర్వేరు కారణాల వల్ల రద్దు చేసినట్టు విమానాశ్రయ అధికారులు తెలిపారు. బెంగళూరు నుంచి విశాఖ వచ్చి వెళ్లాల్సిన విమానాన్ని సాంకేతిక సమస్య కారణంగా రద్దు చేశారు. అదేవిధంగా ముంబై, జైపూర్‌ల నుంచి వచ్చి వెళ్లాల్సిన విమానాలను ప్రతికూల వాతావరణం కారణంగా రద్దు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ చెరువులో పడి రైతు మృతి


మృతిచెందిన రైతు గంట్ల అప్పారావు(ఫైల్)

చీడికాడ, జూలై 8: మండలంలో చెట్టుపల్లికి చెందిన గంట్ల అప్పారావు (56) అనే రైతు ప్రమాదవశాత్తూ మర్రిచెరువులో పడి మృతి చెందాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.నారాయణరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెట్టుపల్లి గ్రామంలో గంట్ల అప్పారావు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత పాడిపశువులను మేతకు మర్రిచెరువు వద్ద ఆదివారం మధ్యాహ్నం తీసుకు వెళ్లాడు. కొంతసేపు మేత మేసిన పశువులు చెరువులోకి వెళ్లాయి. పశువులు ఎంతసేపటికి ఒడ్డుకు రాకపోవడంతో వాటిని పైకి రప్పించేందుకు చెరువు ఒడ్డున దిగి మందలిస్తున్నాడు. అయితే అదే చెరువుగట్టుపై వెళుతున్న గ్రామానికి చెందిన గొర్లె రాము అనే మహిళ చెరువు లోపలికి వెళ్లవద్దు ఊబి ఉందని చెప్పి వెళ్లిపోయింది. పాడిపశువులు ఎంతకీ రాకపోవడంతో కొంతవరకూ దిగిన అప్పారావు ఊబిలో కూరుకుపోయాడు. సాయంత్రం అయ్యేసరికి పశువులు అప్పారావు ఇంటికి వచ్చేశాయి. తన భర్త అప్పారావు రాలేదని అదేరోజు రాత్రి 8 గంటల వరకూ వేచిచూసింది. మర్రి చెరువు వద్దకు తన కుటుంబ సభ్యులను తీసుకుని వెళ్లింది. చెరువు ఒడ్డున తన భర్త చెప్పులు ఉండడంతో కుటుంబ సభ్యులతో చెరువులో వెతికించింది. దీంతో అప్పారావు ఊబిలో మృతి చెంది ఉన్నాడు. దీనిపై సోమవారం ఉదయం చీడికాడ పోలీస్‌స్టేషన్‌కు లక్ష్మి ఫిర్యాదు చేయగా.. వెంటనే ఎస్ఐ జి.నారాయణరావు సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

అనకాపల్లి టౌన్, జూలై 8 : పట్టణంలోని లాడ్జీల్లో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెం గ్రామంలో బాలికను హత్య చేసిన బోడాబత్తుల సురేశ్ కోసం గాలింపు చర్యల్లో భాగంగా పట్టణంలో అన్ని లాడ్జీలను తనిఖీలు చేశారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

చింతపల్లి, జూలై 8: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ అరుణ్ కిరణ్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండల కేంద్రం టీడబ్ల్యూ బాలుర గురుకుల కళాశాల దిగువన అనుమానంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని బ్యాగ్‌లు తనిఖీ చేయగా.. మూడున్నర కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. పట్టుబడిన ఇద్దరు నిందితుల్లో ఒకరిది తిరుపతి కాగా, మరొకరు తమిళనాడుకు చెందిన వ్యక్తియని అన్నారు. వారిని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించామని ఎస్ఐ అరుణ్ కిరణ్ తెలిపారు.

బాలిక హత్య కేసులో నిందితుడి ఆచూకీ చెబితే రూ. 50 వేల నజరానా

» పోస్టర్ విడుదల చేసిన జిల్లా పోలీసులు



రాంబిల్లి, జూలై 8 : మండలంలోని కొప్పుగొండుపాలెంలో బాలికను హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడు బి.సురేశ్ ఆచూకీ చెబితే రూ.50 వేల నగదు బహుమతి అందజేస్తామని జిల్లా పోలీస్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హంతకుడి కోసం పోలీస్ అధికారులు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నా ఇంతవరకు ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు.. నిందితుడి వివరాలతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు. నిందితుడు ఆచూకీ తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. నిందితుడి ఆచూకీ తెలిసినవారు 9440796084, 9440796108, 9440904229 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని పోలీస్ అధికారులు ఆ ప్రకటనలో కోరారు.

ప్రైవేటు ఆర్వో ప్లాంట్ సీజ్

అచ్యుతాపురం, జూలై 8: దిబ్బపాలెం పంచాయతీ మోటూరుపాలెంలోని ఓ ప్రైవేటు ఆర్వో ప్లాంట్‌ను అధికారులు సోమవారం సీజ్ చేశారు. మోటూరుపాలెంలో ఇటీవల డయేరియా వ్యాపించి సుమారు 20 మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో అధికారులు పారిశుధ్యంతో పాటు ఇతర అంశాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా పంచాయతీ పరిధిలో గల ఆర్వో ప్లాంట్‌లను పరిశీలిస్తున్నారు. పంచాయతీ పరిధిలో ప్రభుత్వానికి చెందిన ఒక ఆర్వో ప్లాంట్‌తో పాటు మరో ఐదు ప్రైవేటు ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. ముందుగా మోటూరుపాలెం వద్ద ఉన్న ఆర్వో ప్లాంట్ నీటిని విశాఖపట్నం పరిశీలనకు పంపారు. ఈ ప్లాంట్ ద్వారా వచ్చిన నీటిని ప్రజలతో పాటు పక్కనే గల పాఠశాల పిల్లలకు కూడా ప్రతి రోజూ ఇస్తున్నారు. ఈ ఆర్వో ప్లాంట్‌లోని నీటిలో బాక్టీరియా ఉన్నట్టు నివేదిక వచ్చింది. దీంతో ఎంపీడీవో సురేశ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, పీహెచ్‌సీ సీఈవో వేణుగోపాల్ సోమవారం ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. ఇక్కడ ట్యాంక్‌లో భారీగా నాచు పేరుకుపోయి ఉండడాన్ని గమనించారు. దీంతో వెంటనే ఆర్వో ప్లాంట్‌ను సీజ్ చేశారు. అలాగే పంచాయతీ పరిధిలో గల మిగిలిన ఆర్వో ప్లాంట్ల నీటి నమూనాలను కూడా పరిశీలనకు పంపారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్, లారీ సీజ్


గంగవరంలో సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్

సబ్బవరం, జూలై 8 : జీవీఎంసీ 88వ వార్డు పరిధి గంగవరం గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్ వద్ద సర్వే నంబరు 59లో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను, గ్రావెల్ తరలిస్తున్న లారీని సోమవారం అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. 'ప్రభుత్వం మారినా మాకేంటి?' శీర్షికన గత నెల 28న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, గనుల శాఖ అధికారులు స్పందించారు. సోమవారం తవ్వకాలు జరుగుతుండగా వీఆర్వో వెంకటేశ్ మాటు వేసి పట్టుకుని మైనింగ్ డిపార్టుమెంట్ రాయల్టీ అధికారిణి స్వాతికి అప్పగించారు. ఆమె సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. మైనింగ్ రాయల్టీ అధికారిణి స్వాతి మాట్లాడుతూ ప్రతి రోజు గంగవరం, నంగినారపాడు తదితర ప్రాంతాల్లో నిఘా పెట్టి గ్రావెల్/మట్టి అక్రమ తరలింపులను అడ్డుకొని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

ఉద్యోగుల సమష్టి కృషితో సింహాద్రి పురోభివృద్ధి

» సంస్థ వ్యవస్థాపక దినోత్సవంలో సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



ఉద్యోగుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, జూలై 8 : సింహాద్రి ఎన్టీపీసీ పురోభివృద్ధికి అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేశారని సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ 27వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ప్లాంట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీజీఎం తొలుత జెండాను ఆవిష్కరించారు. సీఐఎస్ఎఫ్ జవాన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు నాణ్యమైన విద్యుదుత్పత్తిని అందిస్తున్న ఘనత సింహాద్రి ఎన్టీపీసీకే దక్కుతుందన్నారు. నాణ్యమైన విద్యుదుత్పత్తిని సాధించడంలో దేశంలోనే సింహాద్రికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సంస్థ అన్ని రంగాల్లో విజయం సాధించడానికి ఉద్యోగులు, అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి తమ వంతు సాయం అందిస్తున్నామన్నారు. ఇందు కోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నామని వెల్లడించారు. వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా స్థానిక బాలభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి జీఎం లు, ఏజీఎంలు, దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజుసిన్హా, క్లబ్ ప్రతినిధులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు

» అధికారులకు ఎస్పీ మురళీకృష్ణ ఆదేశం


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

అనకాపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి అశ్రద్ధ చేయవద్దని అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు, మోసం, కుటుంబ కలహాలు తదితర వివాదాలపై బాధితుల నుంచి 36 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. పలువురు ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో ఎస్పీ మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో బ్రాహ్మణులను కించపరిచే విధంగా పోస్టింగ్‌లు పెడుతున్న పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన దాసు అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అనకాపల్లి, కశింకోట మండలాల బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉపేంద్రబాబు, దివ్య తదితరులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు


కూర్మావతారంలో ఉన్న జగన్నాథస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూలై 8 : స్థానిక ఇంద్రజ్యూమ్న హాల్‌లో కొలువై ఉన్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి సోమవారం భక్తులకు కూర్మావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజసులోచన, కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు.

10న కోర్కెల దినంలో పాల్గొనండి

అనకాపల్లి టౌన్, జూలై 8 : కేంద్రంలో, రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వాలు కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన నిర్వహించే కోర్కెల దినాన్ని విజయవంతం చేయాలని వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్. రూపాదేవి పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం వీవోఏలు, ఉద్యోగుల సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీవోఏల సమస్యలు గత ఐదేళ్లుగా అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు, సంఘ ప్రతినిధులు లక్ష్మి ప్రసన్న, రాజేష్, రమణ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి వచ్చిన యువతి అదృశ్యం

విజయవాడ, జూలై 8: దుర్గమ్మ దర్శనానికి వచ్చిన అనకాపల్లి జిల్లాకు చెందిన యువతి అదృశ్యమైనట్టు సోమవారం విజయవాడలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం పెద్దబొడ్డేపల్లి గ్రామానికి చెందిన యువతి (18) కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 4న వెంకటేశ్వరస్వామి దర్శనం నిమిత్తం తిరుపతి వెళ్లారు. అక్కడ దర్శనానంతరం ఈనెల 7న విజయవాడ కనకదుర్గమ్మ దర్శనార్థం ఇంద్రకీలాద్రికి వచ్చారు. దర్శనానంతరం కొండ దిగారు. కుటుంబసభ్యులతో నడుచుకుంటూ వస్తున్న యువతి కనిపించలేదు. తల్లిదండ్రులు, బంధువులు వెదికినప్పటికీ ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారితోపాటు వచ్చిన శ్రీను అనే యువకుడు కూడా కనిపించకపోవడంతో అతడిపై అనుమానం ఉన్నట్టు యువతి తండ్రి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాడుగుల సంతలో గిరి ఫలాలకు గిరాకీ


మాడుగుల సంతకు గిరిజనులు తీసుకొచ్చిన పైనాపిల్స్

మాడుగుల రూరల్, జూలై 8: మాడుగులలో సోమవారం జరిగిన వారపు సంతలో గిరి ఫలాలకు మంచి గిరాకీ లభించింది. పాడేరు ఏజెన్సీకి చెందిన దేవపురం, కక్కి, కందులుపాలెం, ఈదులుపాలెం, సలుగు, పులుసుమామిడి తదితర గిరిజన గ్రామాల్లోని చెందిన గిరిరైతులు పనస, పైనాపిల్, సీతాఫలాలను పండిస్తుంటారు. ఆయా ఫలాలను కొంతమంది కాలినడక, మరికొంతమంది మినీ వ్యాన్లు, ఆటోలపై ప్రతి సోమవారం మాడుగులలో జరిగే సంతకు తీసుకొస్తుంటారు. వీటిని కొనుగోలు చేసేందుకు అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, తుని, రాజమండ్రి తదితర దూర ప్రాంతాల నుంచి వర్తకులు వస్తుంటారు. గత వారం కంటే ఈ వారం సరుకు తక్కువగా రావడంతో గిరిఫలాలకు ధర పెరిగింది. గత వారం సరుకు ఎక్కువగా రావడంతో చిన్న, పెద్ద సైజుని బట్టి ఒక్క పైనాపిల్ ధరరూ.10లు, రూ.15లు, పనస పండు రూ.70, రూ.100 పలికింది. కాగా. ఈ సోమవారం సరుకు తక్కువగా రావడంతో పైనాపిల్ ధర రూ.20, రూ.25, పనస రూ.100, రూ.150,రూ.200 వరకు పలికింది. ధర ఆశాజనకంగా ఉండడంతో గిరి రైతులు ఆనందం వ్యక్తంచేశారు.

కెందుగూడ పాఠశాలకు పక్కా భవనం మంజూరు

» రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశం
» 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన మంత్రి
» తక్షణమే భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా అధికారులకు ఆదేశాలు



అమరావతి/పాడేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు మండలం కెందుగూడ గిరిజన గ్రామంలో పాఠశాల భవనాన్ని నిర్మించాలని అల్లూరి జిల్లా అధికారులను రాష్ట్ర విద్యా ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'చేయి చేయి కలిపారు.. పాఠశాల షెడ్డును నిర్మించారు' శీర్షికన వచ్చిన కథనంపై మంత్రి లోకేష్ స్పందించారు. వార్త చూసిన వెంటనే కెందుగూడలో పాఠశాలకు పక్కా భవనాన్ని నిర్మించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తమ పిల్లలకు విద్యను అందించే బడి కోసం గిరిజనులు చేసిన కృషి అభినందనీయమని లోకేష్ ప్రశంసించారు. కెందుగూడలో ఆరేళ్ల క్రితం శిథిల భవనాన్ని అధికారులు కూల్చివేశారు. తర్వాత గ్రామస్థులు ఎన్ని పర్యాయాలు వినతులు ఇచ్చినా పాలకులు, అధికారులకు స్పందించలేదు. దీంతో గిరిజనులు, ఉపాధ్యాయుల సహకారంతో రేకుల షెడ్డును నిర్మించారు. ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి కెందుగూడ గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ రాస్తారోకో
నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్



నిందితుడు సురేశ్‌ను కఠినంగా శిక్షించాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులు

రాంబిల్లి, జూలై 8: మండలంలోని కొప్పుగొండుపాలెం గ్రామంలో బాలికను దారుణంగా హత్య చేసిన నిందితుడు సురేశ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం రాంబిల్లి ప్రధాన జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ బాలికను హత్యచేసి పరారీలో ఉన్న నిందితుడు సురేశ్‌ను మూడు రోజులైనా పోలీసులు పట్టుకోకపోవడం బాధాకరమన్నారు. నిందితుడిని త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు వై.రాము, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

'డ్రగ్స్, పోక్సో కేసుల్లో నిందితులపై పర్యవేక్షణ అవసరం'


విచారణ జరుపుతున్న బాలల హక్కుల కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్ ప్రతినిధులు

రాంబిల్లి, జూలై 8: డ్రగ్స్, పోక్సో కేసుల్లో బెయిల్‌పై విడుదల అయ్యే అనుమానిత వ్యక్తులపై పోలీస్ యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ ఉండాలని, వారికి పూర్తిస్థాయిలో కౌన్సెలింగ్ అందించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్ ప్రతినిధులు సూచించారు. మండలంలోని కొప్పుగొండుపాలెం గ్రామానికి చెందిన బాలిక హత్యకు గురైన నేపథ్యంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ తదితరులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారి ఇందిరాదేవి, శశికళ, పర్యవేక్షక అధికారి రాణి, మిషన్ వాత్సల్య సిబ్బంది లక్ష్మి, లోవరాజు పాల్గొన్నారు.

ఆగస్టు 5 నుంచి 11 వరకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

» మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, జూలై 8: విజయవాడ స్టేషన్ వద్ద మూడో లైను నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు విశాఖ - తిరుపతి /కడప ఎక్స్ ప్రెస్ (17488), ఆగస్టు ఆరు నుంచి 11వ తేదీ వరకు కడప /తిరుపతి-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17487)లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఆగస్టు 2 నుంచి 10 వరకు విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), విశాఖ- లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), భువనేశ్వర్- ముంబాయి కోణార్క్ ఎ క్స్‌ప్రెస్ (11020), షాలిమార్- హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045); ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727); ఆగస్టు 5 నుంచి 9 వరకు విశాఖ- నిజాముద్దీన్ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ (12803); ఆగస్టు 8న విశాఖ- సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503), టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్ ప్రెస్ (18111), విశాఖ-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (20803) రైళ్లు వయా గుణదల, రాయనపాడు మీ దుగా మళ్లింపు మార్గంలో నడుస్తాయి. ఆగస్టు 2 నుంచి 10 వరకు సికింద్రాబాద్ - విశాఖ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739), ముంబాయి- భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806), సాయినగర్ షిర్డీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18504), లోకమాన్య తిలక్-విశాఖ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520); ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్-విశాఖ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728), హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046); ఆగస్టు 4, 7న నిజాముద్దీన్-విశాఖ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రె స్ (12804); ఆగస్టు 4న గాంధీధాం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (20804), ఆగస్టు 7న ఓకా-పూరి ఎక్స్‌ప్రెస్ (20820) రైళ్లు వయా రాయనపాడు, గుణదల మీదుగా మళ్లింపు మార్గంలో నడుస్తాయి. ఈ రైళ్లకు రాయలపాడులో హాల్ట్ కల్పించారు.

అనుమానాస్పదంగా రిమాండ్ ఖైదీ మృతి

మద్దిలపాలెం (విశాఖపట్నం), జూలై 8: నగరంలోని పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రాంతానికి చెందిన అరెమల్ల అశోక్ (24) మానసిక రోగి. 2022లో తన తల్లిని హత్య చేయడంతో పోలీసులు అరెస్టు చేయగా కోర్టు రిమాండ్ విధించింది. ఈ మేరకు ఒంగోలు జైలు నుంచి చికిత్స నిమిత్తం ఈ ఏడాది మే 26న నగరంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తీసుకువచ్చారు. కొన్ని రోజులు చికిత్స అనంతరం పోలీసులు మళ్లీ ఒంగోలు జైలుకు తరలించగా అక్కడ నిందితుడు పెదనాన్న బెయిల్ ఇప్పించాడు. ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకే అశోక్ తన పెదనాన్నను కూడా హత్య చేయడంతో పోలీసులు మళ్లీ అరెస్టు చేసి, జైలుకు తరలించారు. సమస్య ఎక్కువ కావడంతో మళ్లీ ఒంగోలు నుంచి వారం క్రితం పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తీసుకువచ్చారు. అప్పటి నుంచి జైల్ గార్డు సంరక్షణలో చికిత్స పొందుతున్నాడు. గార్డు ఆదివారం రాత్రి అశోక్‌ను చూడడానికి వెళ్లేసరికి వార్డులోని కిటికీ ఊచలకు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే ఆసుపత్రి సిబ్బంది సహకారంతో బయటకు తీసుకురాగా వైద్యులు చికిత్స అందించారు. సోమవారం వేకువజామున 2.40 గంటలకు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి వైద్యుల ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా హత్య కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న అశోక్ మానసిక ఆసుపత్రిలో ఆత్మహత్య చేసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

40 కిలోల గంజాయి స్వాధీనం

మాకవరపాలెం, జూలై 8 : మండలంలోని భీమబోయినపాలెంలో బాత్‌రూమ్‌లో దాచి పెట్టిన 40 కిలోల స్వాధీనం చేసుకొని యువకుడ్ని పోలీసులు అరెస్టు చేసినట్టు మాకవరపాలెం ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. భీమబోయినపాలెం గ్రామానికి చెందిన మురుకుట్టి ఈశ్వర సాయిసతీష్ (20) పాడేరు ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేసి చెన్నైకి చెందిన వ్యక్తులకు విక్రయిస్తుంటాడు. ఈనెల ఐదో తేదీన ఎప్పటి మాదిరిగానే పాడేరులో 40 కిలోల గంజాయిని, కిలో రూ.5వేలు చొప్పున కొనుగోలు చేసి తన ఇంటి బాత్‌రూమ్‌లో దాచి పెట్టాడు. పోలీసులకు అందిన పక్కా సమాచారంతో దాడి చేసి 40 కిలోల గంజాయిని, సెల్ స్వాధీనం చేసుకొని నిందితుడ్ని అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. ఈ కేసులో మరికొందర్ని అరెస్టు చేయాల్సి ఉందని ఆయన తెలిపారు.

మునిసిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టండి

▸▸ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పథకం ఏర్పాటు చేయండి

▸▸ విశాఖలో ఉన్నతాధికారులతో చర్చించిన ఎమ్మెల్యే 'సుందరపు'



ఎస్ఈ కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, జూలై 8 : మునిసిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు తాగునీటి పథకం ఏర్పాటుకు చర్యలు చేపట్టాల్సిందిగా ఉన్నతాధికారులను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ఈ మేరకు విశాఖలోని ఎస్ఈ కార్యాలయంలో సోమవారం ఎస్ఈ గణపతిరావు, ఈఈ రాయలబాబును ఎలమంచిలి మునిసిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావుతో కలిసి చర్చించారు. ప్రస్తుతం పట్టణంలో ఉన్న జనాభాతో పాటు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వీటిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు చెప్పారు. అనంతరం కార్యాలయం ప్రాంగణంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే సుందరపు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి టిడ్కో గృహ సముదాయంలో సమస్యలు

పట్టణంలోని రామ్‌నగర్‌లో గల టిడ్కో గృహ సముదాయంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టికి సంఘం ప్రతినిధులు తీసుకు వెళ్లారు. సోమవారం అచ్యుతాపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో అసోసియేషన్ ప్రతినిధులు ప్రసాద్, హైరామ్, ఆడారి గంగాధర్, వార్డు ఇన్‌చార్జ్‌లు కలిసి అక్కడి సమస్యలను వివరించారు. వీటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

బాలికను హత్య చేసిన నిందితుడ్ని శిక్షించాలి



దిమిలి జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ఎలమంచిలి, జూలై 8 : రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలో తొమ్మిదో తరగతి విద్యార్థినిని దారుణంగా హత్యచేసిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా ప్రతినిధులు పట్టణంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఇక్కడి దిమిలి జంక్షన్ వద్ద వీరంతా తొలుత మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. నిందితుడ్ని ఎట్టిపరిస్థితుల్లో విడిచిపెట్టవద్దని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు వందన, భవానీ, శ్రీను, రాజేష్, కృప, మణికంఠతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

'విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపితే సత్ఫలితాలు'



బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న డిప్యూటీ డీఈవో

కోటవురట్ల, జూలై 8 : ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపిననాడు సత్ఫలితాలు సాధించవచ్చునని డిప్యూటీ డీఈవో పి. అప్పారావు అన్నారు. కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలంటే, ఆరో తరగతి నుంచే విద్యార్థులపట్ల ప్రత్యేక దృష్టి సారిస్తే వారు మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవుతారన్నారు. పాఠశాలల పరిసరాలను ఎప్పటికప్పుడు తీర్చిదిద్దడంతో పాటు, నాణ్యతతో కూడిన ఆహారాన్ని మధ్యాహ్నం భోజనంగా అందిస్తే వారు మరింత ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం ఆయా హెచ్ఎం, ఉపాధ్యాయులను పాఠశాలల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఫార్మా రసాయన వ్యర్థాల డ్రమ్ముల కలకలం

... 3వ పేజీ తరువాయి

బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఫార్మాసిటీలో పలు పరిశ్రమలు వ్యర్థాలను రాంకీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించకుండా గుట్టు చప్పుడు కాకుండా ఎక్కడ పడితే అక్కడ విడిచిపెడుతున్నారని ఆరోపించారు. దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ లోవరాజు, చంద్రశేఖర్‌లు అక్కడికి చేరుకొని డ్రమ్ముల్లో గల రసాయన వ్యర్థాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు తరలించారు.

ఇసుక అక్రమాలకు చెక్

... 3వ పేజీ తరువాయి

నిర్వహించారనే వివరాలను గనులు, రెవెన్యూ శాఖల అధికారులు ప్రస్తుతం సేకరిస్తున్నారు.

ఇసుక సేకరణ పాయింట్ల ఎంపికకు కసరత్తు

స్థానిక అవసరాలకు అనకాపల్లి, పాయకరావుపేట, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో శారదా, రైవాడ, పెద్దేరు, వరహా నదీ పరివాహక ప్రాంతాల్లో పరిమితికి లోబడి ఇసుక సేకరణకు అవకాశాలపై గనులు, రెవెన్యూ శాఖల అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. త్వరలోనే మండలాల్లో ఇసుక సేకరణ పాయింట్లను ఎంపిక చేసి అనుమతులు ఇవ్వనున్నట్టు తెలిసింది. ఈ మేరకు గనులు, రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. కొద్ది రోజుల్లోనే ఈ ఇసుక పాయింట్లు అందుబాటులోకి వస్తే పేదల ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కేవలం టన్ను లోడింగ్‌కు రూ.30 వసూలు చేసి దూరాన్ని బట్టి రవాణా చార్జీలు వసూలు చేసి ఉచితంగా ఇసుక ఇవ్వనున్నారు.

భవిష్యత్తులో తగ్గనున్న ఇసుక ధర

గత వైసీపీ ప్రభుత్వం జేపీ వెంచర్స్ ద్వారా రాజమహేంద్రవరంలో రీచ్‌ల డిపోల వద్ద టన్ను రూ.450, నదిలో సేకరించిన ఇసుక టన్నుకు రూ.650 ప్రభుత్వానికి చెల్లించి జిల్లాలో ఇసుక డిపోలకు రవాణా చేసేవారు. టన్ను ఇసుక ధర రేటుతో పాటు రవాణా చార్జీలు భారీగా ఇసుక వినియోగదారుల నుంచి వసూలు చేసేవారు. కూటమి ప్రభుత్వం రాజమహేంద్రవరంలో ఇసుక రీచ్‌ల వద్ద టన్ను ఇసుక ధర రూ.88, లోడింగ్ చార్జీలు, జీఎస్‌టీ కలిపి కేవలం రూ.200 లోపే ధర నిర్ణయించింది. గతంలో కంటే రాజమహేంద్రవరంలో ఇసుకకు టన్ను వద్ద రూ.200 వరకు తక్కువ ధర పడనుంది. ఈ లెక్కన భవిష్యత్తులో జిల్లాలో ఇసుక డిపోలకు రవాణా అయ్యే ఇసుక టన్ను ధర వినియోగదారులకు రూ.900 నుంచి రూ.1100 మధ్య ధర నిర్ణయించే అవకాశం ఉంది. గత ప్రభుత్వం కంటే కొత్త ఇసుక పాలసీతో జిల్లా వాసులకు టన్ను ఇసుకపై రూ.400 వరకు తగ్గే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి రోజు ఒక వ్యక్తికి 20 టన్నుల వరకు ఇసుక ఇచ్చే అవకాశం ఉన్నందున ప్రతి వినియోగదారుడికి ఉచిత ఇసుక పాలసీ వల్ల రూ.8 వేలు వరకు తక్కువ ధరకే ఇసుక అందుబాటులోకి రానుంది.

బినామీ డ్వాక్రా గ్రూపుల నిగ్గు తేల్చండి

▸▸ రూ.లక్షల్లో మోసానికి పాల్పడిన వెలుగు, బ్యాంక్ సిబ్బంది పై చర్యలు తీసుకోవాలి ▸▸ కలెక్టరేట్ ఎదుట బాధిత మహిళలు ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధిత మహిళలు

తుమ్మపాల, జూలై 8 : బినామీ డ్వాక్రా గ్రూపులతో లక్షలాది రూపాయల మోసానికి పాల్పడి, ప్రజలకు మోసం చేసిన వెలుగు, బ్యాంక్ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సదరు బాధితులతో కలిసి కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.శంకరరావు, మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అనకాపల్లి మండలం సత్యనారాయణపురం, కొత్తూరు పంచాయతీల పరిధిలో బినామీ డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేశారన్నారు. సభ్యులకు తెలియకుండా ఒక్కొక్క గ్రూపునకు రూ.15 లక్షలు నుంచి రూ. 20 లక్షలు వరకు రుణాలు మంజూరు చేయించుకుని వెలుగు, బ్యాంకు అధికారులు ఆ సొమ్మును కాజేశారని ఆరోపించారు. గతేడాది డిసెంబరు నుంచి బాధితులు తీసుకున్న రుణాలు చెల్లించాలని బ్యాంకు అధికారుల నుంచి ఫోన్లు, నోటీసులు రావడంతో సభ్యులు ఆందోళన చెందుతున్నట్టు చెప్పారు. దీనిపై డీఆర్‌డీఏ తదితర కార్యాలయాలకు సభ్యులు వెళ్లి విన్నవించినా పట్టించుకునేవారు కరువయ్యారని వాపోయారు. తక్షణమే బాధితులకు న్యాయం చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రుణం మంజూరు చేయకుండానే రూ.రెండు లక్షలు కట్టమని అధికారులు ఒత్తిడి చేస్తుండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

సబ్బవరం: మండలంలోని టెక్కలిపాలెం గ్రామంలో గైరమ్మచెరువు ఆక్రమణలకు గురైందని, ఆక్రమణలను తొలగించాలని అదే గ్రామానికి చెందిన దెందేటి అర్జునరావు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డిటీ వెంకట్‌కు ఫిర్యాదు చేశారు. నల్లరేగులపాలెంలో సర్వే నంబరు 10/1లో 1.53 ఎకరాల ప్రభుత్వ భూమి తన స్వాధీనంలో ఉండేదని, ఆ భూమిని వేరొకరు ఆక్రమించుకున్నారని కోరుడకొండ నాయుడు ఫిర్యాదు చేశారు. అలాగే మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో సర్వే నంబరు 2/6లో 4.09 ఎకరాలు ఎస్సైన్డ్ భూమిని కొంత మంది ఆక్రమించుకొని చదును చేసి, మొక్కలు వేసేందుకు గోతులు తీశారని అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొమ్ము కనకరాజు, ఎంపీటీసీ భర్త గొల్లవిల్లి ఈశ్వరరావు ఫిర్యాదు చేశారు.

హెల్మెట్‌ధారణతో ప్రమాదాలు దూరం

▸▸ న్యాయమూర్తులు విజయ, స్వాతి భవానీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

ఎలమంచిలి, జూలై 8 : హెల్మెట్ వినియోగంపై ఇక్కడి కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.స్వాతి భవానీలు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాలు దూరమన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తమపై ఆధారపడి ఉన్నవారిని గుర్తించి ప్రయాణాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నిర్ణీత ధరకే ఎరువులు విక్రయించాలి

▸▸ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : రంపచోడవరం ఏడీఏ చౌదరి



పరవాడలోని ఓ దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పరవాడ/సబ్బవరం, జూలై 8 : ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే రైతులకు ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని రంపచోడవరం ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి సూచించారు. వ్యవసాయశాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పరవాడ, సబ్బవరంలలో గల పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నాణ్యత, రికార్డులు పరిశీలించారు. రైతులకు న్యాయమైన ఎరువులు, పురుగుల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. షాపుల వద్ద తప్పనిసరిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఐటీపీటీ రవి ప్రసాద్, జిల్లా క్వాలిటీ కంట్రోల్ వ్యవసాయాధికారిణి ఎస్. సరోజినీ దేవి, వ్యవసాయశాఖ అధికారులు చంద్రావతి, రంగాచారి, రూపా, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వెదురువాడలో రెండు పూరిళ్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఇళ్లు

అచ్యుతాపురం, జూలై 8 : మండల కేంద్రం అచ్యుతాపురానికి రెండు కిలోమీటర్ల దూరంలో గల వెదురువాడలో సోమవారం రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఉదయం పదకొండు గంటల ప్రాంతంలో గ్రామం మధ్యలో గల అన్నదమ్ములైన కారుకుండి అప్పలరాజు, రమణ ఇళ్ల నుంచి భారీగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఇళ్లలో ఎవరూ లేరు. అంతా పనులకు వెళ్లిపోయారు. సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు ఎలమంచిలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి, మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే అప్పలరాజు ఇంట్లో గల గ్యాస్ సిలిండర్ పేలిపేవడంతో అంతా భయంతో పరుగులు తీశారు. ఈలోగా సెజ్‌లో గల ఏపీఐఐసీకి చెందిన అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించింది. గ్యాస్ సిలిండర్ పేలడంతో గోడలు పగిలి ఇటుకలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఇంట్లో సామగ్రి మొత్తం ధ్వంసమైంది. కట్టుబట్టలతో మిగిలిన ఈ నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ఈ ఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

పాయకరావుపేట, జూలై 8 : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పలువురు దాతల సాయంతో సోమవారం యూనిఫాం పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.రవిశంకర్‌నాయక్‌తో పాటు పలువురు అధ్యాపకులు, టీడీపీ నాయకుడు వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సతకంపట్టు పాఠశాలలో పుస్తకాల పంపిణీ

అనకాపల్లి టౌన్, జూలై 8 : గవరపాలెం సతకంపట్టులోని జీవీఎంసీ స్కూల్ విద్యార్థులకు కనకదుర్గమ్మ ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు ఆధ్వర్యంలో సోమవారం పుస్తకాలను పంపిణీ చేశారు. కనకదుర్గమ్మ ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, ఆలయ కమిటీ సభ్యులు, గౌరీ పరమేశ్వరుల కమిటీ, మరిడిమాంబ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఒప్పంద కార్మికులు వినతి

అనకాపల్లి టౌన్, జూలై 8 : జీవీఎంసీ పరిధిలో ఒప్పంద కార్మికులకు చెల్లించాల్సిన ఐదు నెలల వేతనబకాయిలు తక్షణమే చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అనకాపల్లి కమిటీ ఒక ప్రకటనలో కోరింది. అనకాపల్లి జోన్ పరిధిలోని పదిహేను మంది కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు లేక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జీతాలు చెల్లించాలని యూనియన్ ప్రతినిధులు అజయ్, వై.శివ, బొమ్మల రాము విజ్ఞప్తి చేశారు.

యల్లయ్య కాలువలో పూడిక తొలగింపు

తుమ్మపాల, జూలై 8 : శారదా నది నుంచి తుమ్మపాల మీదుగా ప్రవహించే యల్లయ్యకాలువలో పూడికలను సోమవారం పంచాయతీ సిబ్బంది తొలగించేకార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. కాలువ శాశ్వత నిర్మాణానికి రూ.80 లక్షలు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేసినట్టు సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తెలిపారు. పంచాయతీ బోర్డులో ఈ సమస్యపై చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

'ఫార్మా' డ్రమ్ములు విడిచిపెట్టడం దారుణం

పరవాడ, జూలై 8 : పెదముషిడివాడ బచ్చల బంద చెరువులో ప్రమాదకర ఫార్మా రసాయనాల డ్రమ్ములను విడిచిపెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ప్రమాదకరమైన రసాయనాలతో నిండిన డ్రమ్ములను చెరువు గర్భంలోకి విడిచిపెట్టి వెళ్లిపోవడం దారుణమన్నారు.

కొణతాలను కలిసిన ఉత్తరాంధ్ర విద్యార్థిసేన



కొణతాలకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ప్రతినిధులు

కొత్తూరు, జూలై 8 : ఉత్తరాంధ్ర విద్యార్థిసేన నేతలు సోమవారం ఇక్కడి రింగురోడ్డులోని జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి, స్టూడెంట్ యునైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు ఆర్.బసవ కృష్ణమూర్తి, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఏయూ ఇన్‌చార్జి కంఠంరెడ్డి సూర్యనారాయణ, విద్యార్థి నాయకులు కుమార్, కొయ్య రామకృష్ణ, వేగి శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

లాలంకోడూరు సర్పంచ్ రమణమూర్తి మృతి



రమణమూర్తి (ఫైల్)

రాంబిల్లి, జూలై 8 : మండలంలోని లాలంకోడూరు పంచాయతీ సర్పంచ్ సర్పంచ్, ప్రముఖ న్యాయవాది లాలం రమణమూర్తి సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందినట్టు ఆయన కుటుంబ సభ్యులు లాలం చందు తెలిపారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ తుదిశ్వాస విడిచిపెట్టినట్టు చెప్పారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం స్వగ్రామమైన లాలంకోడూరులో జరగనున్నట్టు వివరించారు. కాగా, రమణమూర్తి టీడీపీ రాష్ట్ర నేత దివంగత లాలం భాస్కరరావు సోదరుడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమణమూర్తి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

పాయకరావుపేట, జూలై 8 : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం, రక్షిత మంచినీటి సరఫరా నిర్వహణలో తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీవో కె.స్వప్న అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. శానిటేషన్, ఫాగింగ్, వాటర్ ట్యాంకుల క్లీనింగ్, డ్రైన్స్ క్లీనింగ్, క్వాలిటీ వాటర్ సప్లై, రోడ్లకు ఇరువైపుల చెత్త తొలగింపు, ఇంటి పన్నులు వసూలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్‌తో పాటు పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ప్రజల తరపున పోరాడుదాం'

పరవాడ, జూలై 8 : ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతే ప్రజల తరపున పోరాడుదామని వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఇక్కడి పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికలక సంబంధించి అంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు చుక్క రామునాయుడు, బంధం నాగేశ్వరరావు, బురద అప్పలరాజు, వెన్నెల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

10న కార్మికుల సమస్యలపై ఆందోళన

అచ్యుతాపురం, జూలై 8 : కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఈనెల 10న అచ్యుతాపురంలో జరిగే ఆందోళనను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము పిలుపు నిచ్చారు. సోమవారం సెజ్ కర్మాగారాల్లో కార్మికులను కలిసి ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన కొత్త కార్మిక చట్టాలను రద్దు చేయాలని ఆటో, ముఠా, బిల్డింగ్ ఇతర అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేసి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాన్న డిమాండ్లతో ఆందోళన చేస్తున్నట్టు చెప్పారు. నానాజీ, రాము, గణేష్, సత్యం పాల్గొన్నారు.

డాక్టర్ జీవీఎస్ సతీమణి కన్నుమూత



బంగారమ్మ (ఫైల్)

అనకాపల్లి టౌన్, జూలై 8 : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీవీ సత్యనారాయణ సతీమణి బంగారమ్మ సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న స్వగృహంలో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆమె మృతి పట్ల పలువురు బీజేపీ నాయకులు సంతాపం తెలిపారు. మంగళవారం ఉదయం అంతిమయాత్ర ప్రారంభం కానుంది.

వాడవాడలా వైఎస్‌కు ఘన నివాళి



అనకాపల్లి చినవాలుగురోడ్ల కూడలిలో వైఎస్ విగ్రహం వద్ద వైసీపీ నాయకుల నివాళి



పాయకరావుపేటలో కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు తదితరులు



సబ్బవరంలో వైఎస్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అనకాపల్లి టౌన్, జూలై 8 : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని వైసీపీ, కాంగ్రెస్ నాయకులు వాడవాడలా సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రింగురోడ్డులో గల వైసీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో గర్భిణిలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, కార్పొరేటర్లు మందపాటి సునీత, పీలా లక్ష్మీసౌజన్య, కొణతాల నీలిమా, జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, ఆళ్ల నాగేశ్వరరావు, కొణతాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్ : వైఎస్ జయంతిని పాయకరావుపేటలో ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఎదుట ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పూలమాలవేసి నివాళర్పించారు. మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, పెదపాటి అమ్మాజీ, ఇసరపు తాతారావు, జగతా శ్రీను, ధనిశెట్టి బాబి, చోడిపల్లి శ్రీను, కోడ కోటేశ్వరరావు, డి.రాజేష్‌ఖన్నా, వై.అన్నవరం పాల్గొన్నారు. సత్యవరంలో వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంగవరం, పెదరాంభద్రపురం, కుమారపురం, రాజగోపాలపురం తదితర గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ఈ వేడుకలను జరిపారు.

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో వైఎస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు అయినంపూడి మణిరాజు, పొడగట్ల పాపారావు, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలో వైఎస్ జయంతిని జరిపారు. ఎస్.రాయవరంలో వైసీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కంబాల జోగులు, గోవిందరావు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కోటవురట్ల జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైసీపీ అదనపు కార్యదర్శి సాగి సీతబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ రాంబాబు పాల్గొన్నారు.

ఎలమంచిలి: వైఎస్ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎలమంచిలిలోని బస్టాండ్ జంక్షన్‌లో గల ఆయన విగ్రహానికి డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర పూలమాల వేసి నివాళులర్పించారు. ఏటికొప్పాకలో జడ్పీటీసీ శానాపతి సంధ్యారాణి, నాయకులు రాము, రమణబాబు తదితరులు వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, పట్టణంలో నాయకులు కొఠారు కొండబాబు, కోడిగుడ్డు రమణబాబు, దాసరి కుమార్, కొల్లి త్రినాథ్, నూకేశ్వరరావు తదితరులు వైఎస్‌కు నివాళులర్పించారు.

అచ్యుతాపురం: మండల కేంద్రం అచ్యుతాపురం, హరిపాలెం, తిమ్మరాజుపేట తదితర గ్రామాల్లో వైఎస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైసీపీ నేతలు బొడ్డేడ ప్రసాద్, మారిశెట్టి సూర్యనారాయణ, పిన్నమరాజు రవీంద్ర, ఈత బాబూరావు, నగిరెడ్డి నాగేశ్వరరావు, శరగడం జగ్గారావు, పిన్నమరాజు వాసు, కోన బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : వైఎస్ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి జడ్పీటీసీ ధూళి నాగరాజు, వైసీపీ మండల కన్వీనర్ పి. కిశోర్, మాజీ కన్వీనర్ జి.శ్రీనుబాబు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

పరవాడ : వైఎస్ జయంతిని మండల వ్యాప్తంగా నిర్వహించారు. పరవాడ సంతబయలు వద్ద గల ఆయన విగ్రహానికి ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సబ్బవరం : మండలంలో వైఎస్ జయంతిని నిర్వహించారు. సబ్బవరంలోని ఎన్టీఆర్ కూడలిలో వైసీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆరిపాకలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సురేశ్‌రాజ్, గుల్లేపల్లిలో ఎంపీపీ బోకం సూర్య కుమారి వైఎస్‌కు నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, సర్పంచ్ దెడ్డం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

రంగురాళ్ల లీజు క్వారీ భూమికి వైసీపీ ప్రభుత్వంలో పట్టాలు మంజూరు
తహసీల్దార్‌కు పప్పుశెట్టిపాలెం టీడీపీ నేతల ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

గొలుగొండ, జూలై 8: రంగురాళ్ల లీజు క్వారీకి మంజూరు చేసిన భూమికి వైసీపీ ప్రభుత్వంలో పట్టాలు మంజూరు చేశారని పప్పుశెట్టిపాలెం టీడీపీ నాయకులు తహసీల్దారు భాస్కరరాజుకు సోమవారం ఫిర్యాదు చేశారు. పప్పుశెట్టిపాలెం రెవెన్యూలో సర్వే నంబరు 75లో తొమ్మిది ఎకరాల్లో రంగురాళ్ల క్వారీ తవ్వకాలకు 2009లో ప్రభుత్వం 2029 సంవత్సరం వరకు లీజు మంజూరు చేసింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం హయాంలో గత ఏడాదిలో ఐదుగురు రైతులకు పట్టాలు మంజూరు చేశారని పప్పుశెట్టిపాలెం టీడీపీ నాయకులు దట్టం వెంకటరమణ, పొట్ల శ్రీను తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపడతామని తహసీల్దారు హామీ ఇచ్చారు. అలాగే నాగందొరపాలెం రెవెన్యూలో సర్వే నంబర్‌లో 74/4లో 31సెంట్లు రాయపురెడ్డి గంగయ్యమ్మ పేరుపై ఆన్‌లైన్‌లో నమోదై ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు తొలగించారని జానకిరాంపురం గ్రామానికి చెందిన రాయపురెడ్డి త్రివిక్రమరావు ఫిర్యాదు చేశారు.

మంత్రి మనోహర్‌ను కలిసిన జనసేన నేతలు


మంత్రి మనోహర్‌ను కలిసిన రాజాన తదితరులు

నర్సీపట్నం అర్బన్, జూలై 8 : మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సోమవారం జనసేన నర్సీపట్నం నియోజకవర్గ నాయకుడు రాజాన వీరసూర్యచంద్ర తెనాలిలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. అనంతరం నర్సీపట్నం నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అద్దేపల్లి గణేష్, నాయకులు రేగుబళ్ల శివ, మారిశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు విన్నపాల వెల్లువ
▸ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి అర్జీలు సమర్పణ ▸ అందరితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న అధికారులు

నర్సీపట్నం, జూలై 8 : ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీరాములు అర్జీలను స్వీకరించారు. డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి 25 మంది విచ్చేసి తమ సమస్యలను విన్నవించారు. నర్సీపట్నం మునిసిపాలిటీలోని 28వ వార్డు పరిధి సీబీఎం కాంపౌండ్ సమీపంలో నర్సింగ్ కళాశాల, వసతి గృహంలోని వాడకపు నీరు రోడ్డు మీద పారుతుందని, దీని వలన రాకపోకలకు జనం ఇబ్బందులు పతుడున్నారని ఐద్వా నాయకురాళ్లు సూర్యప్రభ, గౌరీ వినతి పత్రాలను అందజేశారు. ఐదో వార్డులో తన ఇంటి కుళాయిలో నీరు రావడం లేదని పెనుబోతుల రాజారావు ఫిర్యాదు చేశారు. కొత్త బయపురెడ్డిపాలెంలోని శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించాలని అక్కడివారు కోరారు. రావికమతం మండలం డొండపూడిలో సర్వే నెంబరు 2, 4లలో తనకు మూడు ఎరాలు భూమి ఉందని, రెండో కోడలు తనను పొలంలోకి వెళ్లనీయడం లేదని న్యాయం చేయాలని జెడ్.కొత్తపట్నానికి చెందిన ఇటంశెట్టి ముత్యాలమ్మ వినతి పత్రం అందజేసింది. అలాగే, మరికొంత మంది తమ సమస్యలను తెలియజేశారు.


సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీరాములు

గబ్బాడ డిపోలో ఇసుక నిల్వలపై విచారణ చేపట్టాలి
▸ మాజీ ఎమ్మెల్యే గణేశ్ డిమాండ్

నర్సీపట్నం, జూలై 8 : గబ్బాడ డిపోలో రూ.ఐదు కోట్లు విలువ చేసే 40 వేల టన్నులు ఇసుకను టీడీపీ నాయకులు దోచుకోవడానికి చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ ఆరోపించారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి తర్వాత గబ్బాడ డిపోలో సుమారు లక్ష టన్నులు ఇసుక నిల్వలు ఉన్నాయని తెలిపారు. గృహ నిర్మాణదారులకు సరఫరా చేయగా, ఇంకా 80 వేల టన్నులు ఇసుక ఉన్నట్టు సమాచారం ఉందని చెప్పారు. అధికారులు టేపుతో కొలిచి 40 నుంచి 50 వేల టన్నులు ఉన్నట్టు చెబుతున్నారని తెలిపారు. మిలిగిన 40 వేల టన్నులు టీడీపీ నాయకులు దోచుకోవడానికి సిద్ధ మయ్యారని ఆరోపించారు. సమగ్ర విచారణ చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

'గుమ్మడి కాయ దొంగ అంటే.. భుజాలు తడుముకున్నట్టు ఉంది గణేశ్ తీరు'

గుమ్మడి కాయ దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ తీరు ఉందని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గబ్బాడ ఇసుక డిపోలో ఇసుక అవకతవకలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు జిల్లా కలెక్టర్‌కు, పోలీసులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీనికి మాజీ ఎమ్మెల్యే ఎందుకు అలా అయిపోతున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు.

వాడవాడలా ఘనంగా వైఎస్ జయంతి


నర్సీపట్నంలో కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్


ఏఎల్‌పురంలో చీరల పంపిణీలో ఎంపీపీ మణికుమారి

నర్సీపట్నం, జూలై 8 : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గల ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్, సీనియర్ నాయకుడు సన్యాసిపాత్రుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం వైఎస్ ఎంతో తపించారన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు తమరాన నాయుడు, గొలుసు నర్సింహమూర్తి, నాయకులు కర్రి శ్రీను, ఎండీ బాషా తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చీడిగుమ్మల, జోగంపేట, కొత్తమల్లంపేట గ్రామాల్లో వైసీపీ నాయకులు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీడిగుమ్మలలో ఎంపీటీసీ సభ్యుడు లెక్కల అప్పలనాయుడు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో వైసీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ చినబ్బాయి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, అలాగే, ఏఎల్‌పురం, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట చోద్యం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో వైసీపీ నాయకులు, కర్యకర్తలు, అభిమానులు వైఎస్ జయంతిని జరిపారు. ఏఎల్‌పురంలో గొలుగొండ ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు చీరలు, విద్యార్థులకు పుస్తకాలు, రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, సర్పంచులు సంతోష్ సుజాత, పందిరి సత్యంనాయుడు, రఘురామ్, ఎంపీటీసీ బుల్లి ప్రసాద్, శివ, పరవాడ కవి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం పెంచాలి'


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

నర్సీపట్నం, జూలై 8 : విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో అప్పారావు అన్నారు. ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(మెయిన్)లో నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలు తరగతి గదిలో విద్యార్థులకు ఉపయోగపడేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రంలో ఎంఈవో తలుపులు పాల్గొన్నారు

ఫార్మా రసాయన వ్యర్థాల డ్రమ్ముల కలకలం
... 3వ పేజీ తరువాయి

బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఫార్మాసిటీలో పలు పరిశ్రమలు వ్యర్థాలను రాంకీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించకుండా గుట్టు చప్పుడు కాకుండా ఎక్కడి పడితే అక్కడ విడిచిపెడుతున్నారని ఆరోపించారు. దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ లోవరాజు, చంద్రశేఖర్‌లు అక్కడికి చేరుకొని డ్రమ్ముల్లో గల రసాయన వ్యర్థాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు తరలించారు.

ఇసుక అక్రమాలకు చెక్
... 3వ పేజీ తరువాయి

నిర్వహించారనే వివరాలను గనులు, రెవెన్యూ శాఖల అధికారులు ప్రస్తుతం సేకరిస్తున్నారు.

ఇసుక సేకరణ పాయింట్ల ఎంపికకు కసరత్తు

స్థానిక అవసరాలకు అనకాపల్లి, పాయకరావుపేట, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో శారదా, రైవాడ, పెద్దేరు, వరహా నదీ పరివాహక ప్రాంతాల్లో పరిమితికి లోబడి ఇసుక సేకరణకు అవకాశాలపై గనులు, రెవెన్యూ శాఖల అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. త్వరలోనే మండలాల్లో ఇసుక సేకరణ పాయింట్లను ఎంపిక చేసి అనుమతులు ఇవ్వనున్నట్టు తెలిసింది. ఈ మేరకు గనులు, రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. కొద్ది రోజుల్లోనే ఈ ఇసుక పాయింట్లు అందుబాటులోకి వస్తే పేదల ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కేవలం టన్ను లోడింగ్‌కు రూ.30 వసూలు చేసి దూరాన్ని బట్టి రవాణా చార్జీలు వసూలు చేసి ఉచితంగా ఇసుక ఇవ్వనున్నారు.

భవిష్యత్తులో తగ్గనున్న ఇసుక ధర

గత వైసీపీ ప్రభుత్వం జేపీ వెంచర్స్ ద్వారా రాజమహేంద్రవరంలో రీచ్‌ల డిపోల వద్ద టన్ను రూ.450, నదిలో సేకరించిన ఇసుక టన్నుకు రూ.650 ప్రభుత్వానికి చెల్లించి జిల్లాలో ఇసుక డిపోలకు రవాణా చేసేవారు. టన్ను ఇసుక ధర రేటుతో పాటు రవాణా చార్జీలు భారీగా ఇసుక వినియోగదారుల నుంచి వసూలు చేసేవారు. కూటమి ప్రభుత్వం రాజమహేంద్రవరంలో ఇసుక రీచ్‌ల వద్ద టన్ను ఇసుక ధర రూ.88, లోడింగ్ చార్జీలు, జీఎస్‌టీ కలిపి కేవలం రూ.200 లోపే ధర నిర్ణయించింది. గతంలో కంటే రాజమహేంద్రవరంలో ఇసుకకు టన్ను వద్ద రూ.200 వరకు తక్కువ ధర పడనుంది. ఈ లెక్కన భవిష్యత్తులో జిల్లాలో ఇసుక డిపోలకు రవాణా అయ్యే ఇసుక టన్ను ధర వినియోగదారులకు రూ.900 నుంచి రూ.1100 మధ్య ధర నిర్ణయించే అవకాశం ఉంది. గత ప్రభుత్వం కంటే కొత్త ఇసుక పాలసీతో జిల్లా వాసులకు టన్ను ఇసుకపై రూ.400 వరకు తగ్గే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి రోజు ఒక వ్యక్తికి 20 టన్నుల వరకు ఇసుక ఇచ్చే అవకాశం ఉన్నందున ప్రతి వినియోగదారుడికి ఉచిత ఇసుక పాలసీ వల్ల రూ.8 వేలు వరకు తక్కువ ధరకే ఇసుక అందుబాటులోకి రానుంది.

చోడవరం
నియోజకవర్గం

మత్స్యావతారంలో జగన్నాథుడు



చోడవరం, జూలై 8: మండల కేంద్రంలోని శ్రీకేశవ స్వామి ఆలయంలో జగన్నాథుని దశ రూప మహోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మత్స్యావతారంలో ఉన్న స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు శ్రీనివాస్, ఉప్పలబాబు, వాణిబాబు పాల్గొన్నారు.

హిందీలో ప్రతిభావంతులకు సత్కారం


విద్యార్థులకు నగదు బహుమతులతో సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

చోడవరం, జూలై 8: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ భాషలో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు సోమవారం సత్కరించారు. కళాశాల హిందీ భాషా విభాగం అధిపతి ఎస్.సూర్యవతి ఆధ్వర్యంలో హిందీ భాషలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందచేశారు. విద్యార్థులకు తెలుగు, ఆంగ్లంతో పాటు జాతీయ భాషలో సైతం ప్రావీణ్యం పెరగాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు హిందీ విభాగం హెడ్ సూర్యవతి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, ఎన్‌ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, పిచ్చమ్మ, అధ్యాపకులు రఫియుద్దీన్, సుధీర్, అప్పలనాయుడు, కృష్ణారావు, మల్లిబాబు, సరస్వతి, రామలక్ష్మి, సత్యవతి, జ్యోతి, నారాయణమూర్తి పాల్గొన్నారు.

గ్రానైట్ మైనింగ్‌పై ఏడీకి ఫిర్యాదు

బుచ్చెయ్యపేట, జూలై 8: మండలంలోని గంటికొర్లాం రెవెన్యూ పరిధిలో ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ లేకుండా చేపడుతన్న గ్రానైట్ క్వారీ పనులు నిలిపివేయాలని గ్రామ సర్పంచ్ శరకాన గౌరమ్మ, ఉప సర్పంచ్ ఎస్వీ రాజారావు డిమాడ్ చేశారు. ఈ మేరకు నర్సీపట్నం మైనింగ్ ఏడీకి ఫిర్యాదు చేశారు. తమ రెవెన్యూ పరిధిలోని భట్లోవ, ఊరిలోవకొండ (హిల్)లో గ్రానైట్ క్వారీ ఉందన్నారు. భట్లోవ రెవెన్యూ భూములకు ఆనుకుని ఉన్న హిల్‌ను క్రిష్టల్ మైనింగ్ కంపెనీకి విశాఖపట్నం మైన్స్ ఏడీ లీజ్‌కు ఇచ్చారన్నారు. సదరు కంపెనీ చేపట్టిన భారీ బ్లాస్టింగ్ కారణంగా సమీపంలోని సాగు భూముల్లో పంటలు నాశనం కావడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గతంలో సదరు మైనింగ్ కంపెనీపై ఏపీ హైకోర్టులో రిట్ వేశామన్నారు. దీంతో మైనింగ్ కంపెనీ వ్యవసాయ భూములకు, కాలువలకు, చెరువులకు నష్టం వాటిల్లకుండా క్వారీ బ్లాస్టింగ్ చేపడతామని రాతపూర్వకంగా ఒప్పందం ఇచ్చిందన్నారు. ఈ హామీకి విరుద్ధంగా చేపడుతున్న భారీ బ్లాస్టింగ్‌తో పంటలు, చెరువు, కాలువలు దెబ్బతింటున్నాయని, దీనిపై ప్రశ్నిస్తే మైనింగ్ కంపెనీ యాజమాన్యం తమపై దురుసుగా వ్యవహరిస్తున్నదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఉచిత ఇసుకతో పేదల అభ్యున్నతి
▸ తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు



బుచ్చెయ్యపేట, జూలై 8: ఉచిత ఇసుక పాలసీ పేదల అభ్యున్నతికి దోహదపడుతుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. వడ్డాది పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తూ జీవో నంబరు 43 విడుదల చేశారన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో వైసీపీ నేతలే ఇసుకాసురులుగా అవతారమెత్తి ఇసుక కుంభకోణం ద్వారా రూ.50 వేల కోట్లకుపైగా కొల్లగొట్టారని ఆరోపించారు. పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఖర్చయితే, ఇందులో ఇసుక కొనడానికే రూ.3 లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితిని లబ్ధిదారులు ఎదుర్కొన్నారని చెప్పారు. నిర్మాణ శాఖకు సరఫరా పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేశారని దుయ్యబట్టారు. జగన్ బినామీ సంస్థ జేపీ వెంచర్స్ చెల్లించాల్సిన మొత్తం నుంచి రూ.800 కోట్లు మినహాయించి ప్రజాధనాన్ని ధారాదత్తం చేయడంపై మండిపడ్డారు. నిరంతరం విజిలెన్స్ పర్యవేక్షణలో అక్రమ ఇసుక తవ్వకాలను నిరోధిస్తూ రాష్ట్ర ప్రజల ప్రగతే ధ్యేయంగా, పర్యావరణం పరిరక్షణ దెబ్బతినకుండా సమర్థవంతంగా టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక సరఫరా చేస్తుందని తాతయ్యబాబు పేర్కొన్నారు.

చిరు వర్తకులకు ఇళ్లు మంజూరు చేస్తా
▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జూలై 8: పట్టణంలో చిరు వర్తకులతో పాటు పాన్‌షాపు యజమానులకు ఇళ్లు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన రాజును శ్రీసిద్ధివినాయక పాన్‌షాపు యజమానుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తమకు ఇళ్లు మంజూరు చేయాలని, సంఘానికి భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, అర్హులైన వారికి పింఛన్లు అందించాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గూనూరు ప్రభాకరరావు, ఉపాధ్యక్షుడు ఎడ్ల వెంకటరమణ, కోశాధికారి జె.ప్రకాశ్, డైరెక్టర్లు భగవాన్, సత్యవతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న చిరు వర్తకులు, పాన్‌షాపు యజమానులు

వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళులు

చోడవరం/బుచ్చెయ్యపేట/రోలుగుంట/ మాడుగుల రూరల్/కె.కోటపాడు/దేవరాపల్లి/చీడికాడ/, జూలై 8: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజపకవర్గాల పరిధిలోని మండలాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. చోడవరంలోని కొత్తూరు జంక్షన్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహానికి ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అలాగే పేదలకు వస్త్రాలు, ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల ప్రధాతగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పేదల హృదయాలలో చిరస్థాయిగా ఉండిపోయారని ఈ సందర్భంగా ధర్మశ్రీ పేర్కొన్నారు.

బుచ్చెయ్యపేట మండలంలోని విజయరామరాజుపేట, మంగళాపురం, దిబ్బిడి, వడ్డాది, బంగారుమెట్ట, రాజాం తదితర గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాడుగుల బస్టాండ్ ఏరియా, కింతలి వల్లాపురంలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. రోలుగుంట మండలంలోని కుసర్లపూడిలో దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి జయంతిని నిర్వహించారు. సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కొళ్ల సన్యాసినాయుడుల వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీడికాడలో మండల కేంద్రంలో వైఎస్ఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కేక్‌కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కె.కోటపాడు మండలంలోని సింగన్నదొరపాలెం గ్రామంలో వైఎస్ఆర్ విగ్రహానికి పార్టీ నేతలు రొంగలి వెంకటరమణ, నారపాటి శ్రీరామ్మూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. దేవరాపల్లిలోని ఎం.అలమండలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వైఎస్సార్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో రెండు నియోజక వర్గాల నాయకులు మారిశెట్టి శ్రీకాంత్, ఏడువాక సత్యారావు, గాడి కాసు, పల్లా నరసింగరావు, డీవీఆర్, బొడ్డేడ సూర్యనారాయణ, ఎ.లింగబాబు, ఎస్.సత్యారావు, బేరా సత్యారావు, వి.ఆనంద్, సూరిశెట్టి నాగదుర్గ గోవింద్, దొండా రాంబాబు, నారాయణమూర్తి, ఎస్.నానాజీ, కె.జనార్దన రావు, కె.అచ్చెంనాయుడు, ఎటిస్.రమేష్, పి.మాణిక్యం, కురచా జయమ్మ, స్వామినాయుడు ఎస్.శ్రీనివాసరావు, అప్పలనాయుడు, రామ్‌కుమార్, పీటీ.బాబు, పి.రామారావు, పి.మహేష్, కె.రామారావు పాల్గొన్నారు.


రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ

చట్టాలపై అవగాహన అవసరం
▸ ఎంపీడీవో బీఎస్‌కేఎన్ పట్నాయక్

కె.కోటపాడు, జూలై 8: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత చట్టాలను అన్ని శాఖల అధికారులు పూర్తి అవగాహన చేసుకోవాలని ఎంపీడీవో బీఎస్‌కెఎన్ పట్నాయక్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. మహిళలు, కిశోర్ బాలికలు, చిన్నారులకు సంబంధించిన న్యాయ సంహిత చట్టంలో సెక్షన్ 63 నుంచి 99 వరకు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీవో వి.మంగతాయరు, పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత, ఎంఈవో-1, 2 కె.సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

నాణ్యమైన పశుగ్రాసంతోనే పాల దిగుబడికి అవకాశం

చీడికాడ, జూలై 8: నాణ్యమైన పశుగ్రాసంతోనే పాల దిగుబడికి అవకాశం ఉంటుందని పశు వైద్యాధికారి జి.గాయిత్రిదేవి చెప్పారు. చీడికాడ పంచాయతీలో రైతులు వేసిన పశుగ్రాసాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాడి రైతులతో ఆమె మాట్లాడుతూ, పశువులకు సరైన మోతాదులో మంచి పాలు దిగుబడినిచ్చే పశు గ్రాసాన్ని పెంచినపుడు రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. అయితే ప్రతీ రైతు వరి, చెరకు పంటలతో పాటు పశుగ్రాసం పెంచుకోవాలని ఆమె సూచించారు. ఇందుకు అవసరమయ్యే విత్తనాలను రాయితీ రూపంలో అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు బీమామిత్రలు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం

వ్యాధుల నివారణకు ముందుకురావాలి


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు

చీడికాడ, జూలై 8: ప్రాణాంతక వ్యాధులు డెంగ్యూ, మలేరియా, అతిసార నివారణకు ప్రజలు ముందుకురావాలని చీడికాడ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు కోరారు. గ్రామంలో గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందితో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం 50 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు చేయగా, ఇద్దరికి జ్వరం ఉన్నట్టు గుర్తించారు. వీరందరికీ అవసరమైన మందులు పంపిణీ చేశారు. వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా వెంకటరావు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం యూవీ.రమణమూర్తి, హెల్త్ అసిస్టెంట్ పి.పేరునాయుడు, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫారాల సరఫరా

కె.కోటపాడు, జూలై 8: మండలంలోని పాఠశాలల విద్యార్థులకు త్వరలో యూనిఫారాలు అందిస్తామని ఎంఈవో కె.సత్యనారాయణ తెలిపారు. మండల వ్యాప్తంగా 2755 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు జతల బట్టలకు సరిపడా విడి క్లాత్ పంపిణీ చేస్తున్నామన్నారు. గతంలో కుట్టిన బట్టల వల్ల ఎన్నో ఇబ్బందులు ఉండేవన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఎవరికి వారు కుట్టించుకోవచ్చునని సూచించారు. ఒక్కో జతకు ప్రభుత్వం రూ.40 అందిస్తుందన్నారు. ఇప్పటికే పాఠ్య పుస్తకాలు, బెల్టు, షూస్, సాక్సులు అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం పాఠశాలలో ప్రవేశాలు చురుగ్గా జరుగుతున్నాయని ఎంఈవో వివరించారు.

హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రసాదరావు

మాడుగుల రూరల్, జూలై 8: మోటారు సైకిల్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాడుగుల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులతో నిర్వహించిన సదస్సులో చోడవరం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనాదు ప్రసాదరావు మాట్లాడుతూ మోటారు సైకిల్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అలాగే లైసెన్స్ లేకుండా వాహనం నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా వాహన యజమానితో పాటు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తారని ఆయన స్పషటం చేశారు. అలాగే లైసెన్స్ లేని వారు, మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే నష్టపరిహారం రాదని చెప్పారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలకు గురైనా తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడుకోవచ్చునని ప్రసాదరావు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.